
తీగ. పరిసరాల్లోవున్న ఆధారాలను అల్లుకునే వుంటుంది. అయినంత మాత్రాన తీగను [illegible] తీగెదికాదే. ఆధారాల [illegible] ?



# భయం

ముద్దంశెట్టి హనుమంతరావు

నాలుగేళ్ళు నిండబోతూన్న మోహన్, వాళ్ళ నాన్నమ్మ అనసూయమ్మ ఒళ్ళోకూచుని వచ్చీరాని మాటల్తో యేవో కబుర్లు చెబుతూవుంటే అనసూయమ్మ మురిసిపోతూ, సమాధానాలు చెబుతోంది అప్పుడప్పుడూ వాడు వేస్తోన్న ఒట్టి ప్రశ్నలకి

మోహన్ కోసం హార్లిక్స్ కలిపి గ్లాసుతో తీసుకొచ్చింది. వసంత

"బాబూ, యిలా రారా హార్లిక్సు తీసుకుందువుగాని...." అంటూ కేక వేసింది వసంత.

మోహన్ అక్కణ్ణించి కదల్లేదు. కనీసం, రావాలనే ఆసక్తిని కూడా కనబర్చలేదు.

"ఇక్కడికి తే అమ్మా!" అన్నాడు మురిపెంగా.

"ఔనమ్మా వసంతా! ఇక్కడికి తెచ్చేయ్.... నేను త్రాగిస్తాలే...." అంటూ మనమణ్ణి వెనకేసుకొచ్చింది అనసూయమ్మ.

వసంత మనసు చివుక్కుమంది. తాను చెప్పిందేదీ వాడు సరిగ్గా విననందుకు బాధపడింది ఇది ఆమెకి కొత్తకాదు. చాలా రోజుల్నించి ఈ సమస్యను ఆమె యెదుర్కొంటోంది అయితే ఆరోజు మాత్రం ఆమెకి యెలాగో అనిపించి, ఆలోచనల్ని రేకెత్తించింది.

తన కొడుకు, యింత చిన్నప్పట్నుంచీ తన మాట వినకండా తనకి దూరమైపోతున్నాడేమోనన్న భయం, ఆరాటం ఆమెని పట్టుకు పీకాయి. ఇలా యెందుకు జరగాలి? తాను వుద్యోగం చేస్తుండటంవల్ల అబ్బాయిని వాళ్ళ నాన్నమ్మ దగ్గర అట్టే పెటక తప్పటంలేదు అలాగని ఆమె దగ్గర మరీ చేరికై, తనమాట బొత్తిగా

గాథావళి :

# ముస్సోలినీ హాబి

1935లో కపూర్థలా సంస్థానాధీశుడు జగ్‌జిత్‌సింగ్ బహాదుర్ ఇటలీ దేశం పర్యటిస్తున్నప్పుడు వ్యక్తిగత హోదాలో ముస్సోలినీని కలుసుకున్నాడు.



ప్రపంచ అగ్రరాజ్యాలలో ఒకటిగా ఇటలీని రుపొందించడంలో ముస్సోలినీ పాత్రను జగ్‌జిత్‌సింగ్ ఎంతో ప్రశంసించాడు. తరువాత వారిద్దరి మధ్య సంభాషణ ఈ విధంగా సాగింది :

"యువర్ ఎక్సెలెన్సీ! ప్రభుత్వ వ్యవహారాలల్లో నిరంతరం తల మునకలై పోతున్న మీ కెప్పుడైనా విరామం లభిస్తోందా ? విరామ సమయంలో ఏ పని చేయటానికి మీరెక్కువ కుతూహల పడతారు?"

"యువర్ హైనెస్! మంత్రులను నియమించడం, తొలగించడం నా కెంతో సరదా అయిన విషయం. తొలగించబడ్డ మంత్రుల పేర్లను పత్రికల్లోను, గెజిట్లలోను చదివి నేనెంతో ఆనందిస్తుంటాను."

—జి. వెంకట రామారావు

వినిపించుకోపోతే యెట్లా ? మొక్కై వంగనిది, మానై వంగుతుందా? ఇది యిలా సాగడానికి వీల్లేదు అయితే దీనికి పరిష్కారమార్గం యేవిటి ? వాడు తన చెప్పు చేతల్లో వుండేలా చేసుకోవడం యెలా? వాళ్ళ నాన్నమ్మ దగ్గర చేరిక అధికమైతే క్రమంగా పెద్దయ్యాక కూడా తనని లక్ష్యపెట్టడేమో ? కన్నతల్లిగా తనని గౌరవించడేమో? ఈ విధమైన ప్రశ్నలు, ఆలోచనలు. ఆమెని కలవరపరిచినయి. ఏం చెయ్యాలో నిర్ణయించుకోలేక. గ్లాసుతో హార్లిక్సు తీసుకుపోయి మోహన్‌కి అందివ్వబోయింది

"ఉహూ(....." అంటూ నాన్నమ్మకేసి చూపించాడు, మోహన్.

వసంత స్తంభించిపోయింది. ఓడిపోయిన వ్యక్తిలా ఆమె మొహం వివర్ణమయింది. కొడుకు తనని నిర్లక్ష్యం చేస్తున్నందుకు వాణ్ణి శిక్షిస్తుందా ? లేక అత్తగార్ని నిందిస్తుందా ? రెండింటిలోయే ఒక్కటీ చెయ్యలేకపోయింది పెల్లుబుక్కుతోన్న కోపం, ఆమె కళ్ళల్లో యెరుపురంగు పులిమింది కాని, యేం చెయ్యగల్దు ? అత్తగారి చేతికి హార్లిక్సు గ్లాసు నందించేసి, అక్కణ్నించి వెళ్ళిపోయింది అనసూయమ్మ ముసి ముసిగా నవ్వుకుంది.

ఇన్నాళ్ళూ లేనిది, ఆ క్షణం నించీ బాబు ఓ సమస్యగా పరిణమించాడు వసంతకి. ఈ సమస్యకి ఓ పరిష్కారమార్గం యేదైనా ఆలోచించాలన్న పట్టుదల ఆమెలో తిష్టవేసింది తాను యింట్లో వున్నంతసేపూ, మోహన్ తనదగ్గరే వుండేలా చేస్తే... ? ఈ ఆలోచన కొంత బావున్నట్టనిపించిందామెకి

ఈ మధ్య మోహన్ రాత్రుళ్ళుకూడా వాళ్ళ నాన్నమ్మ దగ్గరే పడుకుంటున్నాడు. కనీసం ఈ అలవాటునైనా తప్పిస్తే, క్రమంగా వాడిలో కొంత మార్పు రావొచ్చుననే ఆశ పుట్టింది వసంతకి.

ఆ రోజు రాత్రి కాస్త పెందరాళే భోజనాలు ముగించారు బాబూరావు, వసంతాను. అంతకుముందే అనసూయమ్మ, మోహన్ భోంచేశారు. అనసూయమ్మ మనవణ్ణి ప్రక్కన వేసుకుని జోకొడుతోందప్పుడే. వాడు వుండుండి యేవో ప్రశ్నలు వేస్తోంటే, పడుకోమని కోప్పడుతోంది. బూచీ వస్తాడని భయపెడుతోంది, అదే సమయంలో అక్కడికి వెళ్ళింది వసంత.


"రారా, బాబూ నాదగ్గర పడుకుందువుగాని. ఇక్కడుంటే నాన్నమ్మకి నిద్ర పట్టనివ్వవు...." అంది వసంత.

"ఉహూ.... నేను లాను నాన్నమ్మ దగ్గరే పడుకుంటాను," అన్నాడు మోహన్, గోముగా.

వసంతకి తలమీద పిడుగుపడ్డట్లయ్యింది. తను వూహించినట్టు బాబు తనకి దూరంగానే పోతున్నాడు. అందులో సందేహం లేదు . అన్న నిర్ధారణకి వచ్చేసింది మరింత బాధపడింది. చప్పున మాట్లాడలేకపోయింది.

అనసూయమ్మకి, ఆరోజు కోడలు వింతగా ప్రవరిస్తూ వుండటం, ఆశ్చర్యం కలిగించింది. హఠాత్తుగా ఆమెలో యెందుకు మార్పు వచ్చిందో, ఆమె వూహకి అందని విషయమయ్యింది. బాబు తన దగ్గరుండటం కోడలికి యిష్టంలేదా ? అదే కారణమైతే, ఆమె ఆఫీసుకి వెళ్ళిపోయాక, రోజంతా వాడు తన దగ్గరే వుంటాడే ! అయితే, ఆమె ప్రవర్తనలోని అంతరార్థం యేవిటి ?

"వాణ్ణి నా దగ్గరే వుండనీ వసంతా !



# ఆనందమార్గం

ఒకరోజున ఒక యువకుడు పంటినొప్పితో బాధపడ్తూ డాక్టరు దగ్గరకి వెళ్ళేడు. పరీక్ష కోసం డాక్టరు ఆ యువకుణ్ని నోరు తెరవమన్నాడు. కాని యువకుడు భయంతో నోరు తెరవలేదు. డాక్టర్ టేబిల్ మీద బెల్ నొక్కాడు. వెంటనే ఒకడు వచ్చి "మీకు ఉద్యోగం వచ్చింది సార్." అని ఆ యువకుడితో అన్నాడు "ఆఁ" అంటూ ఆశ్చర్యపోయాడు యువకుడు. డాక్టరు వెంటనే పిప్పిపన్ను తీసేశాడు.

—పి. రాజ్యలక్ష్మి

★

తండ్రి : అదేమిటిరా రాము కవరు పోస్టు చేయమంటే తిరిగి తీసుకొచ్చావు.

రాము : డబ్బాకు తాళం వేసి ఉంది నాన్నా.

—యం. వెంకటేశ్వరరావు

★

ఒకడు . ఏరా! ఊట్టాల బాధ భరించలేకపోతున్నావ్? "దోమలున్నాయ"ని బోర్డు పెట్టలేకపోయావా?

మరొకడు పెట్టానురా! కాని "దోమల మందు!"రానుకుని వచ్చేస్తున్నారు. ఏం చేద్దాం.

—బి. రజనీ కుమారి

★

"మధ్యధరా భూములని వేటిని అంటార్రా" అనడిగారు మాస్టరుగారు

వెంటనే మోహన్ తడుముకోకుండా "అటు ఎక్కువ ధరకు, ఇటు తక్కువ ధరకు కాకుండా మధ్య ధరకు కొనడానికి వీలయ్యే భూములను మధ్యధరా భూములంటారండీ" అన్నాడు.

—యస్ మహమ్మద్ యూనస్

★

ఇద్దరు పిల్లల సంభాషణ

మొదటివాడు : ఏరా! విమానం అంత ఎత్తున ఎగురుతుంది కదా! అందులోనివారికి ఎండ వేడి ఎక్కువ కదూ?

రెండవవాడు : అందుకే కదరా విమానం ముందు అంత పెద్ద ఫ్యాను తిరుగుతుంటుంది.

★

భర్త : (భార్యపై కోపంతో) ఏమేవ్! నువ్వు వండేది అన్నమా? గడ్డా?

భార్య : (శాంతంగా) ప్రతి భార్య భర్త తినగా మిగిలిందే తింటుందండీ!

—టి కమలాకర ప్రసాద్.

ని దగ్గరుంటే మారాం చేస్తాడు. నా దగ్గర పడుండటం వాడికి అలవాటైపోయింది కూడాను. అదిగాక, వాడు లేకపోతే నాకూ యేమిటో అదోలా వుంటుంది." అంది అనసూయమ్మ.

అత్తగారికి సమాధానం యేంచెప్పాలో అర్థంకాలేదు వసంతకి లోపల బాధపడినా. ఆవేశంతో వణికి పోయినా. నురేమీ అనలేక విసురుగా అక్కణ్ణించి వెళ్ళిపోయింది వసంత.

*   *   *

పడకగదిలో మంచం మీద పడుకుని వారపత్రిక చదువుకుంటున్నాడు బాబూరావు.

వసంత విసురుగా వచ్చి అతని ప్రక్కనే కూలబడ్డం. అతని దృష్టిని మరల్చింది ఆమె మొహంకేసి చూసి విస్తుపోయాడు బాబూరావు తన ఆరేళ్ళ వైవాహిక జీవితంలో, భార్య అంత విసుగ్గా, కోపంగా వుండటం, యెప్పుడూ చూళ్ళేదు అతను. ఆ ప్రళయానికి కారణం యేమైవుంటుందా అనుకొని. చదువుతున్న వారపత్రికను ప్రక్కనపెట్టేసి.

"అలా వున్నావేం వసంతా?" అన్నాడు మెల్లగా

"నా ఖర్మ...." విసురుగా అంది వసంత.

ప్రక్కనే అగ్ని పర్వతం బ్రద్దలైనట్లయింది బాబూరావుకి. నిర్విణ్ణుడయ్యాడు. వసంతనోట అటువంటిమాట వినడం అదే మొదటిసారి

"ఇంత అర్థాంతరంగా "ఖర్మ" జ్ఞాపకమొచ్చిందేమిటి వసంతా?"

ఆమె ఆవేశాన్ని వుపశమించడానికే అన్నటుగా మెల్లగా మందహాసంచేస్తూ అన్నాడు బాబూరావు.

"ఖర్మగాకపోతే యేమిటండీ? మన బాబుకి మనమీద మక్కువ రోజు రోజుకీ తగ్గిపోతోందండీ మన మాటనే వాడు పట్టించుకోవడంలేదు దీనికి కారణం వాడికి అత్తయ్యగారి దగ్గర చేరిక అధిక మవ్వడమేమో ననిపిస్తోందండీ! ఆమె మాట, వాడికి వేదవాక్యమై పోతోంది" నిస్పృహతో దిగాలుపడుతూ అంది వసంత.

బాబూరావుకి నవ్వొచ్చింది, నవ్వేశాడు. ఈ చిన్న విషయానికే వసంత యెందుకలా కంగారు పడిపోతోందో అతనికి అర్థంకాలేదు.

"నీ పిచ్చిగాని. బాబుకి యీ చిన్న వయసులో "మక్కువ" అంటే యేం తెలుస్తుంది వసంతా? మా అమ్మదగ్గర యెప్పుడూ వుండటం అలవాటయ్యిందిగాబట్టి. ఆమె దగ్గర వాడికి చేరిక వుండటం అసహజమేంకాదు సాధారణంగా పిల్లలకి ముసలాళ్ళ దగ్గరే యెక్కువ చేరిక వుంటుంది. దీంట్లో తప్పేముంది? ఇందులో కంగారు పడాల్సిందేముంది?" చాలా తేలిగ్గానే అన్నాడు బాబూరావు

వసంతకి భర్త ధోరణి నచ్చలేదు ఈ విషయాన్ని ఆయనంత తేలిగ్గా తీసుకోవడం హర్షించలేదామె. "మీకు అట్లాగే అనిపిస్తుందండీ! కాని కన్న తల్లిగా నాకు మాత్రం వాడిధోరణి క్రమంగా అసంతృప్తిని కలిగిస్తోంది. అన్నం తినిపించడమూ వాళ్ళ నాన్నమ్మే తినిపించాలి. హార్లిక్సు ఆమె త్రాగిస్తేనే త్రాగుతాడు. బట్టలూ వాళ్ళ నాన్నమ్మే వేయాలి నిద్రపోవడమూ వాళ్ళ నాన్నమ్మ దగ్గరే నిద్రపోవాలి ఇదేంబావుందిచెప్పండి? క్రమంగా నేను వాడి తల్లిననే విషయాన్ని మర్చిపోవచ్చుకూడా ఏమైనా, వాడి అలవాట్లలో మార్పు తీసుకు రావాలండీ! ముఖ్యంగా, వాణ్ని రాత్రి పూట నా దగ్గరే పడుకోబెట్టుకోవాలి వాడికి నామీద మమకారం ఆప్యాయత, పెరిగేలా చూడాలి" అంటూ యేకబిగిని చెప్పుకుపోయింది వసంత

వసంతకేసి ఆశ్చర్యంగా చూశాడు బాబూరావు. ఆమెలో యిటువంటి ఆలోచనలు యెందుకు వుత్పన్నమయ్యాయో అతని వూహకి అందలేదు

"అవేం మాటలు వసంతా? ఎవరైనా వింటే నవ్వుతారు కూడాను నువ్వు వాడి కన్నతల్లివి. నీమీద వాడికి ఆప్యాయత లేకపోవడమేమిటి? మమకారం లేకపోవడమేమిటి? కాకపోతే, మనిద్దరమూ వుద్యోగాలకి పోతూవుంటాంగాబట్టి, పగలంతా వాడు వాళ్ళ నాన్నమ్మ దగ్గరే వుంటాడు. అందుకే వాళ్ళిద్దరి మధ్య పటిష్టమైన అనుబంధం పెనవేసుకుంది. వాడింకా చంటాడు క్రమంగా పెరిగి పెద్దవుతున్నకొద్దీ వాడి మనస్తత్వంలో, అలవాటలో మార్పు తప్పక వస్తుంది. దీనికి, యింతగా కంగారుపడ్డం, యేమేమో వూహించుకోవడం, అనవసరం." మెల్లగా మందలించినట్టుగానే అన్నాడు బాబూరావు.

"మీకు కంగారు లేకపోతే లేకపోవచ్చునండీ! మీ కున్నంతటి గుండె నిబ్బరం నాకులేదు. నాకెందుకో భయం వేస్తోంది. ఈ పద్దతిలో పెరిగితే వాడు మన అదుపాజ్ఞల్లో వుండక, మీ అమ్మగారి అతిగారాబపు వాతావరణంలో పెరిగి నిర్లక్ష్యంగా తయారయినా ఆశ్చర్య పడాల్సిందేమీ

లేదు. అప్పుడు బాధపడవల్సింది మనమే ..."

"అదంతా నీ భ్రమ వసంతా "

"భ్రమ కాదండీ! అది నా భయం అయినా, ఆడవాళ్ళు యేం చెప్పినా దాన్ని చాలా తేలిగ్గా కొటిపారేస్తారేమిటండీ మీ మగాళ్ళు? అదెంత వరకూ నిజమో ఆలోచించరేం? ఆడవాళ్ళ ఆలోచనలకి విలువివ్వరేం!"

"అబ్బ. ఇంక నీ వుపన్యాసాన్ని ఆపు వసంతా అనవసరమైన ఊహోహల్ని పెట్టుకోకు " విసుగ్గా అన్నాడు బాబూరావు.

"ఏమైనాసరే, రేపట్నుంచి బాబు రాత్రి పూట నాదగ్గరే పడుకుంటాడు " మొండిగా అంది వసంత ఆమె మొహంలో గంభీరత తగ్గలేదింకా

వసంత నిర్ణయాన్ని బాబూరావు సమర్థించలేకపోయాడు.

"మరీ యింత మొండిపట్టు పనికిరాదు వసంతా కాస్త ఆలోచించు."

"మొండిపట్టు కాదండీ! నా మాతృహృదయం తీసుకున్న నిర్ణయమిది. నా ఆవేదన మీకు అర్థంకాదు "

"ఇది ఒక్క రోజులో రావల్సిన మార్పు కాదు వసంతా! క్రమంగా రావాలి. అయినా. అర్ధాంతరంగా నీ ఆలోచనల్ని ఆచరణలో పెడితే మా అమ్మ యేమనుకుంటుందో. ఆమె మనస్సు యెంతగా ఆక్రోశిస్తుందో వూహించావా?" అన్నాడు బాబూరావు.

వసంత, భారంగా ఓ నిట్టూర్పు విడిచింది "మీరు, మీ అమ్మ బాధపడుతుందనే ఆలోచిస్తున్నారుగా!, బాబు కన్నతల్లిగా నేనెంత బాధపడుతున్నానో గ్రహించలేకపోతున్నారండీ! ఎంతయినా మగాళ్ళనిపించుకున్నారు." అందామె.

బాబూరావు నిర్ఘాంతపోయాడు. ఎప్పుడూ లేనిది వసంత వాగ్వివాదంలోకి దిగడం అతనికి ఆశ్చర్యం కలిగించింది యింతేకాదు— ఆమె తనని నిందించే ధోరణిలో మాట్లాడినందుకు కాస్తంత బాధపడ్డాడు.

"గ్రహించలేకపోవడంకాదు వసంతా! నీ బాధ యేమిటో అర్థం చేసుకోగలిగాను అయితే అది నీ వూహ మాత్రమే! కేవలం నీ భ్రమే. విషయాన్ని తాత్కాలికంగా యోచించడానికి ప్రయత్నించు బాబుని మా అమ్మ తానుగా చేరదియ్యలేదు మనం యిద్దరమూ వుద్యోగాలు చేస్తున్నాంకాబట్టి అబ్బాయిని మా అమ్మ అధీనంలో పెటాం. ఆ మనుమడితో ఆమెకిప్పుడో విధమైన బంధం యేర్పడిపోయింది. హఠాత్తుగా ఆ బంధాన్ని త్రెంచివేయడం సబబుగా వుండదు—మనకి శ్రేయస్కరం కాదు. ఈ వయస్సులో అమ్మ మనసుకి యెంతకు నొప్పి కలిగించడమని నా అభిప్రాయం. నువ్వు నన్ను తప్పుగా అర్థం చేసుకుంటున్నావు" అంటూ భార్యకి నచ్చ జెప్పడానికి ప్రయత్నించాడు బాబూరావు.

భర్తధోరణి వసంతను మరింత రెచ్చ గొట్టిందనే చెప్పాలి ఆమెకి యేడుపొస్తోందని. చెమ్మగిల్లిన ఆమె కళ్ళే చెబుతున్నయ్.

"మీ అమ్మ మనసుకి నొప్పి కలక్కూడదు కాని, నేను యెంత బాధపడినా యేమైపోయినా మీకు అవసరం లేనట్టుంది మీధోరణి చూస్తుంటే. ఔనండీ! ఇప్పుడలానే వుంటుంది మిమ్మల్ని మనసారా ప్రేమించాను మీరే నా సర్వస్వం అనుకుని వివాహం చేసుకున్నాను. మీ హృదయంలో సర్వదా నాకు స్థానం వుంటుందని కలలు గన్నాను. కాని నా వూహలన్నీ నా కలలన్నీ నిజంకావని యిప్పు డనిపిస్తోందండీ!" రుద్ధ స్వరంతో అందివసంత

వసంత కంటతడి బెట్టడం బాబూరావుకి అసహ్యమేసింది. ఆడది, అర్థరహితంగా యెందుకు కంటతడిపెడుతుందో, యితనికి యిప్పటికీ అర్థంకాలేదు అందుకే విసుక్కున్నాడు,

"పిచ్చిగా వాగకు వసంతా! ప్రస్తుతమైన బాబు విషయానికి, మన ప్రేమకి సంబంధం యేమిటి? అది అప్రస్తుతమిక్కడ. దీనికీ కంటతడి బెట్టుకోవడమేనా? ఆడవాళ్ళకి యిది అనాదినించీ వస్తోన్న అలవాటు. ఇంతకీ. యిప్పుడేం తక్కువయింది నీకు? నేనెప్పుడైనా నీపట్ల నిరాదరణ చూపించానా?" కాస్త విసుగానే అన్నాడు బాబూరావు. అతనికి తెలుసు - విషయం దారితప్పిందని.

"నా మీద ప్రేమ, అభిమానం వున్నట్టు మీరు నటిస్తున్నారు. కాని, నిజానికి మీ అంతరాంతరాల్లో ప్రేమలేదు. ముమ్మాటికీ లేదు...." అంది, కాస్తంత వుడుకుమోత్తనంతో.

బాబూరావులో సహనం పట్టుతప్పింది. వసంత. యెన్నడూ లేంది ఈ రోజు హద్దులు మీరిపోతోందేమో ననిపించిందతనికి.

"ఏమిటి వసంతా, ఆలోచన లేకుండా మాట్లాడుతున్నావు? కాస్త వొళ్లు దగ్గర పెట్టుకుని యోచించి మరీ మాట్లాడు. నువ్వేదో వుద్యోగం వెలిగిస్తున్నావన్న గర్వంతో నోటికొచ్చినట్టంతా మాట్లాడడం మంచిదికాదు." చిరుకోపంతో అన్నాడు బాబూరావు.

భర్త మాటలు, వసంతని మరింత రెచ్చ





పూర్తి జీవితానికి అసాధారణమైన బలం

జీవనానికి మరింత కుతూహలాన్ని చేకూర్చి పెడుతుంది. ఒకాసా మీ శరీరంలో బలం, శక్తి తిరిగి సమకూర్చటానికి ఇంతు శక్తివంతమైన 6 రసాయనిక పదార్థాలు, 6 ఖనిజములు, 10 అత్యావశ్యకమైన విటమినులు, అశ్వగంధ, యోహింబైన్ వంటి మొక్కల సారములు ఇమిడి వున్నాయి. ఒకాసా తీసుకోండి. జీవితం ఆనందమయమౌతుంది.

ఇప్పుడు అనువైన కొత్త ప్యాక్‌లో

ఒకాసా

పేరెన్నికగన్న అన్ని మందుల దుకాణాలలోనూ దొరుకుతుంది.

ఒకాసావారి ఉచిత పుస్తకంకోసం వ్రాయండి:

OKASA CO PVT LTD.
P.O.Box No. 396 Bombay-400 001

037

నెలకు రు. 1000/-లు సంపాదించండి

ఎలక్ట్రిక్ గైడ్ రు. 10/-: ఫొటోగ్రఫీ రు. 6/-: రేడియో గైడ్ రు. 10/- వివాహపు జీవితం 100 బొమ్మలతో రు. 7/-: మెడికల్ సెక్స్ గైడ్ 88 బొమ్మలతో రు. 10/-: డ్రాయింగ్, పెయింటింగ్సు గైడు రు. 8/-: టైలరింగ్ & కటింగ్ రు. 7/-: 350 ఎంబ్రాయిడరీ డిజైన్లు రు. 8/- సబ్బు తయారీ రు 5/-: 300 కుటీర పరిశ్రమ గైడు రు 15.

ప్రతి ఒక్కటి పోస్టేజి 1.50.

ILFA BOOK DEPOT
Aligarh-25

గొట్టాయి అగ్నిమీద ఆజ్యంపోసినట్ట యింది.

"ఉద్యోగం చేస్తున్నానన్న గర్వం నాకెప్పుడూ లేదండీ! మీ మగాళ్ళకి యిదో అలవాటయ్యింది. ఉద్యోగం చేస్తున్నస్త్రీలు గర్వంతో పూరికే మిడిసిపడుతూ వుంటారని భావించడం పరిపాటయింది అదికేవలం మీ భ్రమ. నాకే కాదు ఉద్యోగంచేసే యే స్త్రీకీ అటువంటి అహం వుండదు. తనూ తన భర్తకి చేదోడు వాదోడుగా వుంటూ, కుటుంబాన్ని ఆదుకుంటున్నానన్న ఒక్క సంతృప్తే వుంటుంది. అదెవ్వరూ అర్థం చేసుకోరు. ఆ భావనే లేకపోతే, హాయిగా ఇంట్లో కూచోవచ్చునుగా!" అంది వసంత.

"అటువంటి సంతృప్తినే కాంక్షించేదానివైతే, ఈరోజు ఈ చిన్న సమస్యను భూతద్దంలో చూపించి, యిలా వాదించేదానివికాదు. ఆ వాదనలో నన్ను అర్థరహితంగా నిందించేదానివీ కాదు. కాస్తంత సహనాన్ని పెంచుకుని ప్రశాంతిని కాంక్షించి, పరిస్థితులతో రాజీపడేదానివి." తను సర్దుకు పోతూవుంటే, వసంత దాన్ని బలహీనతగా తీసుకుని రెచ్చిపోతోందనుకున్నాడు బాబూరావు. అందుకే ఆమె పొరపాటుని యెత్తి చూపించాడు. అప్పుడైనా ఆమె నిజాన్ని గ్రహిస్తుందని అతని ఆశ.

"రాజీపడక యిన్నాళ్ళూ నేనేం చేశానండీ? ఏ పరిస్థితికి నేను యెదురు తిరిగానని? ఆ సంగతి మీకు తెలీదా?" కాస్త తగ్గుస్థాయిలో అంది వసంత.

"ఆ ప్రశ్న వేసేముందు యింతకుముందు నే నెప్పుడైనా నిన్నీవిధంగా అడిగానా? అన్నది ఆలోచించు. ఇన్నాళ్ళూ నువ్వేదో నన్ను యెదిరించావని నేను అనడంలేదు. కాని, ఈరోజు సంగతి మాట్లాడుతున్నాను. ఈ రోజు నువ్వు తీసుకొచ్చిన సమస్య యెంత అర్థవంతమైనది? ఎంత సబబుగా వుందని?"

"నా కన్నకొడుకుని, నాకు దగ్గరగా చేసుకోవాలని ప్రయత్నించడం ఓ సమస్యగా మీరు భావిస్తే, నేను వేరే యేమీ చెప్పలేనుగాని, యిటువంటి పరిస్థితుల్లో నేనిప్పుడనుభవిస్తున్న భయం, బాధ, యే కన్నతల్లి కయినా సహజంగా వుంటుందన్న నిజాన్ని మీరు గ్రహిస్తే చాలు" అంది వసంత. ఆమె గొంతు కాస్తంత కంపించింది.

బాబూరావుకి ఆవేశం, ఓ మెట్టు కిందికి దిగింది.

"దానికి మార్గాంతరం యేదో ఆలోచించాలిగాని, అనుకున్న క్షణమే ఆ మార్పు వచ్చేయాలంటే యెలా సాధ్యం? దాంట్లో యిమిడివున్న సాధకబాధకాలు ఆలోచించాలి కదా!" సౌమ్యంగా అన్నాడు బాబూరావు.

వసంత క్షణం యోచించింది. భర్త అన్నట్టు తాను అర్థం లేకండా వాదనలోకి దిగింది ఇప్పుడు తను ముఖ్యంగా చూడాల్సింది తన కొడుకు తనని నిర్లక్ష్యం చెయ్యకుండా చూడ్డం. తనపట్ల వాడికి మమకారం పెరిగేలా చూడ్డం. భవిష్యత్తులో వాడెగా మారిపోతాడోనన్న భయం, ఆందోళన తనలో అంతరించాలి. అందుకు ఒక్కటే మార్గం.... తాను వుద్యోగానికి రాజీనామా యిచ్చేయాలి తను వుద్యోగం చేస్తూ, భర్త సానుభూతిని సంపాదించ లేకపోయినపుడు, కొడుకు మమకారాన్ని పొందలేనపుడు. ఆ వుద్యోగాన్ని తనెందుకు చెయ్యాలి? తను వుద్యోగం చేస్తున్న పరిస్థితుల్లో, తన కొడుకు తనకి దూరమైపోతున్నాడని తెలుసుకున్న తర్వాతకూడా, తను వుద్యోగం యెందుకు వెలిగించాలి? ఎవర్ని వుద్ధరించడానికి?.. అన్న ఆలోచనలు ఆమెలో గొలుసులా మెదిలినయ్. చివరికి ఓ నిర్ణయాని కొచ్చింది.

"కానండీ! ఆలోచించాలి. నేను లోతుగా ఆలోచించాను. ఈ సమస్యకి పరిష్కార మార్గం ఒక్కటే అగుపిస్తోందండీ" మెల్లగా అంది వసంత.

"ఏమిటి వసంతా?"

"నా ఉద్యోగానికి రాజీనామా యివ్వడం ఒక్కటే మార్గమండీ."

నిర్ఘాంతపోయాడు బాబూరావు. అతని మొహంలో రంగుమారింది. ఉద్యోగాలు దొరక్క బాధపడుతున్న యీ రోజుల్లో, వున్న వుద్యోగం వదులుకోవడమంత తెలివిహీనత మరోటి వుండదని అతనికి తెలుసు. అయితే, వసంత బుర్రలో పాతుకుపోయిన ఆ భయాన్ని యెలా పోగొట్టడం....?

"వసంతా, నువ్వు అనవసరంగా కంగారుపడి తొందర పాటుతో యిటువంటి నిర్ణయం తీసుకోకు. దానివల్ల నష్టపోయేది నేనొక్కణ్ణే కాదు. మనకుటుంబం అంతాను ఎందరో విద్యాధికులైన స్త్రీ పురుషులు వుద్యోగాలు దొరక్క విరక్తి జెందుతోన్న తరుణంలో వున్న వుద్యోగాన్ని వదులుకుంటానని నీలాంటివారు అంటుండటం యెవరైనా వింటే నవ్విపోతారు. ఎల్లప్పుడూ నువ్వు వుద్యోగం చేస్తాననిగాని, చెయ్యాలనిగాని, నేననుకోను. ఇప్పుడు కాకపోతే మరి కొన్నాళ్ళు పోయాక పరిస్థితుల్లో మార్పు వచ్చాక, మనకి యిద్దరు ముగ్గురు పిల్లలు పుట్టాక యినా నువ్వు వుద్యోగం మానక తప్పదు. అంతవరకైనా వున్న అవకాశాన్ని వదులుకోవడం శ్రేయస్కరం కాదు. ఇక, అబ్బాయి సమస్య అంటావా, ఆ విషయంలో మరోసారి లోతుగా ఆలోచించు. చిన్నపిల్లలు తాతల దగ్గర, అమ్మమ్మల, నాన్నమ్మల దగ్గర చేరిక కలిగివుండటం అసహజమేంకాదు. నా మట్టుకు నా విషయం తీసుకుంటే, మా నాన్నమ్మ దగ్గర నేను పెరిగాను. అలాగని నేను మా అమ్మను మర్చిపోయానంటావా? లేక నా తలిదండ్రుల్ని అలక్ష్యంచేసి కేవలం నాన్నమ్మ చెప్పుచేతల్లో వున్నానంటావా? చదువుకున్నదానివి.... తార్కికంగా ఆలోచించు." అన్నాడు బాబూరావు.

వసంతకి, ఈసారి భర్తమాటలు బాగా నెత్తికెక్కాయి. ఆయన చెప్పిందీ నిజమేనని పించింది. తన తెలివితక్కువ తనానికి, తొందరపాటు నిర్ణయానికి చిన్న బుచ్చుకుంది లోలోన

"అంతేనంటారా?" అంది భర్త మొహంలోకి చూస్తూ.

## బరంపురం సభలు

బరంపురంలో సభలు
పండుటాకు పారశాలకు
తరలిన తరుణారుణ పలవాలు
బహుదూరపు బాటసారులు
విడిదిచేసిన విశ్వాసాలు
కవులు కవ్వాలు చిలికిన సముద్రాలు
తేలిన నిజాలు ఎగిరిన పతాకాలు
పిలిచిన తీరాలు సాగిన ప్రయాణాలు

బరంపురంలో సభలు
వస్తువుగా విచ్చేసిన ప్రజలు
రూపంగా మారిన రచయితలు
వస్తు రూప గాంధర్వంలో
ప్రయోజనం కన్నుల పండుగ
మూడునాళ్ళ ముచ్చటలో
మూడు తరాల ముక్త కంఠాలు

బరంపురంలో సభలు
యువతరం గనులు
వెలికి తీసిన విప్లవాలు
నిగు తేలిన కలాలు
నిర్మల సంగీతాలు.

—జ్వాలాముఖి

బాబూరావు నవ్వేశాడు.

"పిచ్చిదానా! తాత్కాలికంగా నీలో రేకెత్తిన భయం నిన్నలా కలవరపర్చింది గాని, నేను చెప్పింది అక్షరాలా నిజం. బాబు యెప్పటికీ నీకు దూరంకాడు. పిచ్చి పిచ్చి వూహల్ని కట్టిపెట్టు" అన్నాడు ఆమెని దగ్గరగా తీసుకుని. "తొందర పడ్డానండీ" అంటూ లేచి వెళ్ళిస్విచ్ఆఫ్ చేసి వచ్చింది వసంత.

తృప్తిగా ఓ నిట్టూర్పు విడిచాడు. బాబూరావు ఆమెను తన కౌగిలిలోకి చేర్చుకుంటూ. వసంత మనసులోని భయం పటాపంచ లయింది.

★




**అతి గాఢంగా పనిచేసే**
**అమృతాంజన్ డెర్మల్ ఆయింట్‌మెంట్**

చర్మవ్యాధులకు ఉపయోగపడే సాధారణ ఆయింట్‌మెంట్లు ఎక్కువగా చర్మం లోపలకు ప్రవేశించలేవు. కాని అమోఘమైన చర్మరోగ నివారణ ఔషధాలు విశిష్టంగా చేరివుండడంచేత అమృతాంజన్ డెర్మల్ ఆయింట్‌మెంటు మాత్రము లోపలకు ప్రవేశిస్తుంది. సాధారణ చర్మవ్యాధులను అతి శీఘ్రంగా నిర్మూలించి చర్మాన్ని పూర్వస్థితికి తెచ్చి సహజంగాను ఆరోగ్యవంతంగాను ఉంచుతుంది.

అమృతాంజన్-డెర్మల్ ఆయింట్‌మెంట్ తామర, గజ్జి, దురద ఇతర చర్మ రోగాలకు ఆదర్శమైన నివారిణి.

నేడే ఒకటి కొనండి!




**అమృతాంజన్ లిమిటెడ్** 14/15 లజ్ చర్చిరోడ్డు మద్రాసు 600 004

SAA/AM/1906 RI TEL